ఏదీ నాటి ఉద్యాన నగరం?

- బెంగళూరు తాజా దుస్థితిపై నెటిజన్ల ఆవేదన
- పారిశ్రామిక వేత్త హర్ష్ గోయెంకా వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చ



బెంగళూరు, మార్చి 9: ఒకప్పుడు పచ్చగా కళకళలాడుతూ, స్వచ్ఛమైన వాతావరణంతో ఉద్యాన నగరంగా పేరొందిన బెంగళూరు నేడు ఐటీ రాజధానిగా మారి కాలుష్యం, రణగొణ ధ్వనులతో గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లతో, అస్తవ్యస్తమైన రోడ్లు, కట్టడాలతో నిండి ఉండటం పట్ల ఆర్‌పీజీ గ్రూప్ చైర్మన్ హర్ష్ గోయెంకా ఎక్స్‌లో పెట్టిన పోస్ట్ సామాజిక మాధ్యమంలో చర్చకు దారి తీసింది. 'నిర్మల స్వర్గ ధామం నుంచి ట్రాఫిక్ రద్దీతో నిండిన మహా నగరం'గా బెంగళూరు మారిన వైనాన్ని ప్రస్తావిస్తూ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి, నందన్ నీలేకని చిత్రాలను ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆయన రాసిన పోస్ట్ ప్రకారం ఒకప్పుడు బెంగళూరు నగరం నిర్మలమైన స్వర్గధామంగా ఉన్నప్పుడు కబ్బన్ పార్కులో ఉదయపు నడకలు, ప్రీమియర్ పద్మినీ కారులో సరదా డ్రైవింగ్‌లు, మధ్యాహ్న సమయాలలో బుక్‌స్టోర్‌ల్లో కాలక్షేపాలు, సరదా కబుర్లు ఉండేవి. అయితే కొందరు తెలివైన ఐటీయన్లు తమ జీవిత భాగస్వాముల నుంచి కొంత సొమ్ము పట్టుకొచ్చి వెచ్చించారు. దాంతో ఇప్పుడు గార్డెన్ సిటీలో చల్లటి గాలిని ఆస్వాదించడానికి బదులుగా ఔటర్ రింగ్ రోడ్‌పై గంటలు గంటలు ఇరుక్కుపోయి కాలం గడపాల్సి వస్తున్నది. వారంతా దీనిని అభివృద్ధి అంటున్నారని హర్ష్ గోయెంకా వ్యాఖ్యానించారు. కాగా, ఆయన వ్యాఖ్యలపై నెటిజన్లు అనుకూల, వ్యతిరేక కామెంట్లు చేశారు. బెంగళూరులో మౌలిక సదుపాయాలు క్షీణించాయని కొందరు వ్యాఖ్యానించగా, మరికొందరు నగర అభివృద్ధిని, అందులో సాంకేతిక మార్గదర్శకుల పాత్రను ప్రశంసించారు. 'బెంగళూరు సామర్థ్యం గల నగరం. గత రెండు దశాబ్దాలుగా దాని అభివృద్ధి స్పష్టంగా కన్పిస్తున్నది. ఈ రోజుకు కూడా కొత్త సిటీ కన్నా గార్డెన్ సిటీ లాంటి పాత నగరంలోనే రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయి. సాంకేతికతను నారాయణ మూర్తి అడ్డుకుంటే ఆయనను నిందించగలము కాని.. బెంగళూరులోని దయనీయమైన మౌలిక సదుపాయాలకు ఆయనను నిందించ లేం కదా. రాజకీయ నాయకుల బిల్డర్ లాబీయే దీనికి కారణం. వారు చెరువులు, కుంటలు ఆక్రమించారు. వారు రోడ్లు వేయలేదు. మౌలిక సదుపాయాలు కల్పించకుండా నగరాన్ని నాశనం చేశారు' అని ఒక నెటిజన్ విమర్శించారు. 'బెంగళూరు పరివర్తన నగర పరిణామాలలో ఒక కేస్ స్టడీ. ఇందుకు ఇన్ఫోసిస్, ఐఐటీయన్లకు కృతజ్ఞతలు' అని మరొకరు వ్యాఖ్యానించారు. అభివృద్ధి, విధ్వంసం పక్క పక్కనే ఉంటాయని.. ఈ రెండూ లేకుండా ఒక్కటే కావాలనుకోవడం అత్యాశే అని మరో నెటిజన్ కామెంట్ చేశారు.

కర్ణాటక బడ్జెట్ ఖర్చులకే సరి

అభివృద్ధి పనులకు నిధుల కొరత

బెంగళూరు, మార్చి 9: కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో అభివృద్ధి మాట దేవుడెరుగు.. అయిదింట నాలుగువంతులు గ్యారెంటీల అమలు, సిబ్బంది జీతాలు, రుణ బకాయిలు, సబ్సిడీల చెల్లింపులకే సరిపోతున్నది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి మొత్తం బడ్జెట్ అంచనా వ్యయం రూ.4.09 లక్షల కోట్లు కాగా, అందులో 78 శాతం లేదా, రూ.3.21 లక్షల కోట్లు ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాల అమలుకే ఖర్చు చేయాల్సి ఉంది. ఈ ఏడాది మూలధన వ్యయం 27 శాతం పెంచి రూ.71,336 కోట్లుగా నిర్ణయించగా, అది చాలని పరిస్థితులు ఏర్పడ్డాయి. కట్టుబడిన వాగ్దానాలు నెరవేర్చడానికి ఖర్చు చేయడం తప్ప వాటిని తగ్గించలేమని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆర్థిక సలహాదారు బసవరాజు రాయరెడ్డి వ్యాఖ్యానించారు.

ఉప రాష్ట్రపతికి ఛాతీలో నొప్పి

ఎయిమ్స్‌లో చికిత్స

న్యూఢిల్లీ: ఛాతీలోనొప్పి రావడంతో ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖఢ్ ఆదివారం తెల్లవారుజామున ఎయిమ్స్‌లో చేరారు. 73 ఏండ్ల ధన్‌ఖఢ్‌కు తెల్లవారుజామున 2 గంటల సమయంలో ఛాతీలో నొప్పి, ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది ఏర్పడడంతో ఆయనను క్రిటికల్ కేర్ యూనిట్(సీసీయూ)లో ఉంచి, కార్డియాలజీ విభాగం అధిపతి డాక్టర్ రాజీవ్ నరంగ్ పర్యవేక్షణలో చికిత్స అందచేస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, డాక్టర్ల బృందం పర్యవేక్షణలో వైద్య చికిత్సలు జరుగుతున్నాయని దవాఖాన వర్గాలు తెలిపాయి. ప్రధాని మోదీ, కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా ఎయిమ్స్‌ను సందర్శించి ధన్‌ఖఢ్ ఆరోగ్యం గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్టు చేస్తూ ధన్‌ఖఢ్ ఆరోగ్యంగా ఉండాలని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సమస్యలపై సమరమే!

- నేటి నుంచి పార్లమెంట్ మలి విడత బడ్జెట్ సమావేశాలు
- డీలిమిటేషన్, డూప్లికేట్ ఓటర్ ఐడీలు, ప్రతీకార సుంకాలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడానికి సిద్ధమైన ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ, మార్చి 9: పార్లమెంట్ మలి విడత బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నియోజక వర్గాల పునర్విభజన(డీలిమిటేషన్), ఓటర్ల జాబితాలో అక్రమాలు, మణిపూర్‌లో మళ్లీ ఘర్షణలు చెలరేగడం, ట్రంప్ యాంత్రాంగాన్ని ఎదుర్కోవడంలో కేంద్ర ప్రభుత్వ అసమర్థత, వక్ఫ్ సవరణ బిల్లు వంటి కీలక అంశాలపై ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వంపై కత్తులు నూరుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండవ విడత బడ్జెట్ సమావేశాలు వాడీవేడిగా జరిగే అవకాశం ఉంది. మరోవైపు కేంద్ర బడ్జెట్‌కు ఆమోదం పొంది ఆ ప్రక్రియను ముగించడం, మణిపూర్ బడ్జెట్‌కు పార్లమెంట్ ఆమోదం పొందడం, వక్ఫ్ సవరణ బిల్లుకు సభలో ఆమోదం పొందడంపై మోదీ సర్కారు ప్రధానంగా దృష్టి పెట్టనున్నది. నియోజక వర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాదికి అన్యాయం జరుగుతుందని ప్రాంతీయ పార్టీలు ఆందోళన చెందుతున్నాయి. దీనిపై చర్చకు పట్టు బట్టాలని డీఎంకే నిర్ణయించింది. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపు కోసం కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టే అవకాశం ఉంది. అక్కడ స్వేచ్ఛా సంచారానికి అనుమతి ఇచ్చినా.. ఘర్షణలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రాన్ని నిలదీయడానికి విపక్షాలు సిద్ధమయ్యాయి.

మరోవైపు పెద్దఎత్తున డూప్లికేట్ ఓటరు గుర్తింపు కార్డుల(ఎపిక్) జారీపై ఎన్డీయే ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెడతామని ప్రతిపక్షాలు ప్రకటించాయి. ఈ అంశంపై తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పించగా మూడు నెలల్లో లోపాలను సరి చేస్తామని ఎన్నికల కమిషన్ ఇప్పటికే ప్రకటించింది. సోమవారం ఈసీతో భేటీ కానున్న టీఎంసీ నాయకులు కాంగ్రెస్, డీఎంకే, శివసేన(యూబీటీ) తదితర ప్రతిపక్ష పార్టీలతో కలసి పార్లమెంట్‌లో ఈ అంశంపై చర్చకు పట్టుబట్టే అవకాశం ఉంది. ఇక ప్రతీకార సుంకాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలు కూడా పార్లమెంట్ సమావేశాల్లో ప్రకంపనలు సృష్టించే అవకాశం ఉంది. వక్ఫ్ ఆస్తులపై కేంద్రం అజమాయిషీని సవరణ బిల్లు పెంచుతుందని.. ఈ బిల్లును సంయుక్తంగా వ్యతిరేకించాలని ఇండియా కూటమి నాయకులు నిర్ణయించినట్టు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరామ్ రమేశ్ వెల్లడించారు. దేశంలో స్వేచ్ఛాయత ఎన్నికలు జరగడం లేదని, ఎన్నికలను కుట్రలు, కుతంత్రాలతో నిర్వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. బడ్జెట్ మలి విడత సమావేశాలు ఏప్రిల్ 4 వరకు కొనసాగుతాయి.

అబ్బే.. అమెరికాకు భయపడి కాదు!

- సుంకాల తగ్గింపుపై భారత్ వివరణ
- వాణిజ్య సంబంధాలను మెరుగు పరుచుకోవడానికేనని వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 9: అమెరికా దిగుమతులపై సుంకాలు తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయంపై కేంద్రం వివరణ ఇచ్చింది. అభివృద్ధి చెందుతున్న దేశాలతో ద్వైపాక్షిక ఒప్పందాల ద్వారా వాణిజ్య సంబంధాలను మెరుగుపర్చుకోడానికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే సుంకాలు తగ్గించినట్టు అధికారులు స్పష్టం చేశారు. తమ ఉత్పత్తులపై భారత్ విధిస్తున్న సుంకాలకు ప్రతీకారంగా తాము సైతం పన్నులు వేస్తామని, ఏప్రిల్ 2 నుంచి వాటిని అమలు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన క్రమంలోనే అమెరికాకు భయపడి భారత్ ఈ సుంకాలను తగ్గించిందన్న వార్తలను అధికారులు తిరస్కరించారు. గతంలో కూడా ఆస్ట్రేలియా, యూఏఈ, స్విట్జర్లాండ్, నార్వే వంటి దేశాలతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల సమయంలో కూడా ఈ సుంకాలు తగ్గించిన విషయాన్ని వారు గుర్తు చేశారు. . ప్రస్తుతం అమెరికా, భారత్ మధ్య టారిఫ్‌ల తగ్గింపు విషయమై జరుగుతున్న చర్చలు ఈ దృష్టితోనే చూడాలి తప్ప ట్రంప్ డెడ్‌లైన్ వల్ల కాదని ఆ వర్గాలు స్పష్టం చేశాయి. వార్తా సంస్థల కథనం ప్రకారం.. ఒక్క వ్యవసాయ ఉత్పత్తులు మినహా తాము ఎగుమతి చేస్తున్న అన్ని వస్తువులపై సుంకాలు తొలగించాలని భారత్‌ను అమెరికా కోరింది. ఈ డిమాండ్‌ను భారత్ అంగీకరించినట్టయితే ఎలాంటి ప్రతిఫలం లేకుండానే తన వాణిజ్య రక్షణలను వదులుకోవాల్సి వస్తుంది.

న్యూయార్క్‌లో భీకర కార్చిచ్చు

అత్యవసర పరిస్థితి విధింపు

వాషింగ్టన్, మార్చి 9: న్యూయార్క్‌కు చెందిన లాంగ్ ఐలాండ్‌లోని అటవీ ప్రాంతంలో భారీ కార్చిచ్చు చెలరేగింది. దీంతో గవర్నర్ క్యాథీ హోచుల్ రాష్ట్రంలో అత్యవసర పరిస్థితిని విధించారు. ముఖ్యంగా లాంగ్ ఐలాండ్‌లో పలు చోట్ల చెలరేగిన కార్చిచ్చు శనివారం భీకర రూపం దాల్చింది. ఇక్కడి ఓ ప్రధాన జాతీయ రహదారిని అధికారులు మూసేయించారు. మిలటరీ బేస్‌ను ఖాళీ చేయించారు. అలాగేపైన్ బారెన్స్ ప్రాంతం చుట్టూ పలు చోట్ల మంటలు చెలరేగాయి. వేగంగా కదులుతున్న దావానలంతో ఇక్కడున్న ఓ రసాయన కర్మాగారం, అమెజాన్ వేర్‌హౌస్‌కు ప్రమాదం పొంచి ఉందని అధికారులు అంచనా వేశారు. రెండు వాణిజ్య సంస్థల భవనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. లాంగ్ ఐలాండ్ అటవీ ప్రాంతంలో మంటల్ని ఆర్పేందుకు మొత్తం రాష్ట్ర యంత్రాంగం రంగంలోకి దిగింది.

అమెరికాలో హిందూ ఆలయంపై దాడి

ఖండించిన భారత్

కాలిఫోర్నియా: అమెరికాలోని కాలిఫోర్నియాలో గల చినో హిల్స్‌లో ఉన్న బీఏపీఎస్ హిందూ దేవాలయంపై దుండగులు దాడి చేశారు. ఆలయ గోడలపై విద్వేష రాతలు రాశారు. అమెరికాలోని బీఏపీఎస్ అధికారిక పేజ్ ఈ సంఘటన వివరాలను శనివారం సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసింది. హిందువులు విద్వేషానికి వ్యతిరేకంగా దృఢంగా నిలబడతారని స్పష్టం చేసింది. విద్వేషం బలపడటానికి అవకాశం ఇవ్వబోమని చెప్పింది. శాంతి, కారుణ్యాలు పైచేయి సాధించేలా కృషి చేస్తామని తెలిపింది. కొద్ది రోజుల్లో లాస్ ఏంజిల్స్‌లో ఖలిస్థానీ రిఫరెండం జరగబోతున్న నేపథ్యంలో ఈ దాడి జరగడం గమనార్హం. చినో హిల్స్‌లోని హిందూ దేవాలయంపై దాడిని భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రభుత్వాధికారులను కోరింది.

ఎర్ర కంది పప్పుపై 10 శాతం పన్ను

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఎర్ర కంది పప్పుపై 10 శాతం సుంకం విధించింది. ఈ మేరకు శనివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో దిగుబడి సుంకం 5 శాతం కాగా, వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి సుంకం(ఏఐడీసీ) 5 శాతంగా పేర్కొంది. ఈ నిర్ణయం మార్చి 8 నుంచే అమల్లోకి వచ్చినట్టు స్పష్టం చేసింది. మరోవైపు పసుపు రంగు బఠానీలపై దిగుబడి సుంకం మినహాయింపు గడువును మే 31 వరకు పొడిగించింది. దేశీయంగా లభ్యతను పెంచేందుకు ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

సిరియాలో ఘర్షణలు తీవ్రం

రెండు రోజుల్లో వెయ్యి మందికి పైగా మృతి

బీరుట్: సిరియా భద్రతా దళాలు, పదవీచ్యుతుడైన దేశాధ్యక్షుడు బషర్ అల్ అస్సాద్ విధేయుల మధ్య రెండు రోజుల పాటు జరిగిన ఘర్షణలు, ప్రతీకార హత్యల్లో వెయ్యి మందికి పైగా మరణించారు. యుద్ధాన్ని పర్యవేక్షిస్తున్న సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ సంస్థ ఈ వివరాలను శనివారం వెల్లడించింది. సిరియాలో పెద్ద ఎత్తున జరిగిన హింసాత్మక సంఘటనల్లో ఇదొకటని తెలిపింది. కాల్పుల్లో సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోయారని వెల్లడించింది. 745 మంది పౌరులు, అస్సాద్‌కు అనుబంధంగా పని చేస్తున్న ఉగ్రవాద సంస్థకు చెందిన 148 మంది, ప్రభుత్వ బలగాలకు చెందినవారు 125 మంది మరణించారని చెప్పింది.

వైట్‌హౌస్ వద్ద కాల్పులు

దుండగుడిని కాల్చి చంపిన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు

వాషింగ్టన్ డీసీ, మార్చి 9: అమెరికా అధ్యక్షుడి అధికారిక భవనం వైట్‌హౌస్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున కాల్పులు కలకలం సృష్టించాయి. ఆయుధాలు కలిగి ఉన్న ఓ దుండగుడిపై అమెరికా సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్పులు జరిపారు. అనంతరం అతడిని సమీపంలోని దవాఖానకు తరలించారు. అయితే కాల్పులు జరిగిన సమయంలో అమెరికా అధ్యక్షుడు వైట్‌హౌస్‌లో లేరని, సమాచారం. ఆత్మాహుతి దళ సభ్యుడు వస్తున్నట్టు ఇండియానా నుంచి సమాచారం అందింది. అతడిని పట్టుకునే క్రమంలో అతడిపై కాల్పులు జరిపారు.

ఉక్రెయిన్‌పై రష్యా దొంగ దెబ్బ!

గ్యాస్ పైప్‌లైన్‌లో వచ్చి వెనుక నుంచి దాడులు

కీవ్, మార్చి 9: గ్యాస్ పైప్ లైన్‌లో నడుచుకుని వచ్చిన రష్యా సైనికులు కుర్స్క్ ప్రాంతంలోని ఉక్రెయిన్ సేనలపై వెనుక నుంచి విరుచుకుపడ్డారు. నిరుడు ఆగస్టులో ఉక్రెయిన్ ఆకమించుకున్న సరిహద్దు ప్రావిన్స్ అయిన కుర్స్క్‌లో తమ భూభాగాన్ని తిరిగి చేజిక్కించుకునేందుకు రష్యా బలగాలు ముందుకు కదులుతున్నాయి. రష్యా సైనికులు 15 కిలోమీటర్లు గ్యాస్ పైపులైన్‌లో అనేక రోజులు నడుచుకుంటూ వచ్చి సుడ్జా పట్టణ సమీపంలో వెనుక నుంచి ఉక్రెయిన్ దళాలపై దాడులు చేసినట్టు వార్తా కథనాలు వెలువడ్డాయి.

పౌల్ట్రీ ఫారాలపై నిఘా పెంచండి

బర్డ్ ఫ్లూ నేపథ్యంలో కేంద్రం సూచన

న్యూఢిల్లీ: హెచ్5ఎన్1 వైరస్ (బర్డ్ ఫ్లూ) పట్ల అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. పౌల్ట్రీ ఫారాలు, మార్కెట్ల వంటి హై రిస్క్ ప్రాంతాల్లో నిఘాను పెంచాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈ నెల 7న సూచించింది. ఏవియన్ ఇన్ఫ్లూయెంజా కోసం జాతీయ యాక్షన్ ప్లాన్‌లో తెలిపిన చర్యలను అమలు చేయాలని చెప్పింది. సాంకేతిక సహాయాన్ని అందజేస్తామని తెలిపింది. ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్‌ను సిద్ధంగా ఉంచాలని, పశు వైద్య, ప్రయోగశాలలు పెంచాలని కోరింది.

యూఎస్ అధికారులకు లై డిటెక్టర్ టెస్టులు

వలసదారుల గుర్తింపు లీక్ చేస్తే కఠిన శిక్షలు

వాషింగ్టన్ : అక్రమ వలసదారులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న సోదాల గురించి మీడియాకు సమాచారం ఇస్తున్న వారిపై కఠిన చర్యలకు అమెరికా ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ తన సిబ్బందికి పాలిగ్రాఫ్ టెస్టులు చేస్తున్నది. డీహెచ్ ఎస్ అధికార ప్రతినిధి మాట్లాడుతూ, మూడు వారాల నుంచి ఈ పరీక్షలు జరుగుతున్నాయని చెప్పారు. డీహెచ్ ఎస్ సెక్రటరీ క్రిస్టి నోయిమ్ మాట్లాడుతూ.. పట్టుబడినవారు 10 సంవత్సరాల వరకు జైలు శిక్షను అనుభవించే అవకాశం ఉందన్నారు.

'బోఫోర్స్ సాక్ష్యాలను బయటపెట్టాలి'

న్యూఢిల్లీ: బోఫోర్స్ శతఘ్నుల కుంభకోణంలో లంచాలపై స్విట్జర్లాండ్ నుంచి పెట్టెలో వచ్చిన సాక్ష్యాలను బయటపెట్టాలని సీబీఐని సీనియర్ జర్నలిస్ట్, రచయిత్రి చిత్ర సుబ్రహ్మణ్యం కోరారు. ఈ సాక్ష్యాలను కోర్టుకు సమర్పించినట్లు మాజీ సీబీఐ అధికారులు తెలిపారు. 'బోఫోర్స్ గేట్ : ఏ జర్నలిస్ట్స్ పర్స్యూట్ ఆఫ్ ట్రూత్' అనే పుస్తకాన్ని ఇటీవల చిత్ర రాశారు. కుంభకోణం గురించి దీనిలో వివరించారు. స్విట్జర్లాండ్ నుంచి వచ్చిన సాక్ష్యాలతో కూడిన పెట్టెను ఎవరు తెరిచారు? ఆ పెట్టెల్లో ఏమి ఉంది? తమకు చెప్పాలని ఆమె ఆ పుస్తకంలో డిమాండ్ చేశారు.

'చౌకబారు' దెబ్బకు కుదేలయ్యారు!

అల్లాబాదియా వ్యాఖ్యల తర్వాత తగ్గిన ఇన్‌ఫ్లుయెన్సర్ల మార్కెటింగ్

న్యూఢిల్లీ: హాస్యం పేరిట చౌకబారు వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ రణ్‌వీర్ అల్లాబాదియా దెబ్బకు మొత్తం ఇన్‌ఫ్లుయెన్సర్ల మార్కెటింగ్ తీవ్రంగా ప్రభావితమైంది. యూట్యూబ్ సహా వివిధ సోషల్ మీడియా వేదికలపై గుర్తింపు అందుకున్న ఇన్‌ఫ్లుయెన్సర్ల మార్కెటింగ్ రేట్లు ఒక్కసారిగా పతనమయ్యాయని తాజా నివేదిక ఒకటి వెల్లడించింది. 'చాలా కేసుల్లో ఇన్‌ఫ్లుయెన్సర్ల మార్కెటింగ్ రేటు 50 శాతానికి పైగా పడిపోయింది. కొన్ని చోట్ల అసలు వారిని పరిగణలోకి తీసుకోవట్లేదు' అని యాడ్ ఏజెన్సీ సీఈవో ఒకరు చెప్పారు. ట్రావెల్ ఇన్‌ఫ్లుయెన్సర్ శివాదిత్య బరజత్య మాట్లాడుతూ, 'బ్రాండ్ డీల్స్‌లో 5 నుంచి 10 శాతం వరకు రేట్స్ పడిపోయాయి. ఇండియాస్ గాట్ లెటెంట్ వివాదం తర్వాత చిన్న స్థాయి ఇన్‌ఫ్లుయెన్సర్లు పొందే మొత్తాలు గణనీయంగా పడిపోయాయి. అలాగే పేరొందిన బ్రాండ్స్ ఆందోళన చెందుతున్నాయి' అని అన్నారు. ఓ కామెడీ షో(ఇండియాస్ గాట్ లెటెంట్)లో ప్రముఖ యూట్యూబర్ రణవీర్ అల్లాబాదియా చేసిన వ్యాఖ్యలు దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపాయి. అతనిపై పలు రాష్ట్రాల్లో పోలీస్‌స్టేషన్లో కేసులు నమోదయ్యాయి. కేంద్రం స్వయంగా రంగంలోకి దిగి నోటీసులు ఇవ్వడంతో యూట్యూబ్ అతని అభ్యంతరకర వ్యాఖ్యల వీడియోను తొలగించింది. అయితే ఇదంతా రణ్‌వీర్ ఒక్కడి కెరీర్‌నే కాదు, మొత్తంగా ఇన్‌ఫ్లుయెన్సర్ల కెరీర్‌నే ప్రమాదంలోకి నెట్టేసిందని నివేదిక తెలిపింది.

రంజాన్ వేళ అశ్లీల ఫ్యాషన్ షో!

- మండి పడిన కశ్మీర్ మత పెద్దలు
- చర్యలు తీసుకుంటామన్న సీఎంఒ

శ్రీనగర్, మార్చి 9: పవిత్ర రంజాన్ మాసం వేళ ఉత్తర కశ్మీర్ గుల్మార్గ్‌లోని ప్రముఖ స్కైరిసార్టులో ఆదివారం ప్రభుత్వ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యాషన్ షో నిర్వహించడం వివాదంగా మారింది. షోలో పాల్గొన్నవారు రెచ్చగొట్టే తరహాలో దుస్తులు ధరించారని స్థానిక మత పెద్దలతో పాటు హురియత్ కాన్ఫరెన్స్ చీఫ్ మిర్వాయిజ్ ఉమర్ ఫారూక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది దారుణంగా ఉందని విమర్శించారు. ఫ్యాషన్ షోకు సంబంధించిన చిత్రాలు, వీడియో తమను దిగ్భ్రాంతికి గురి చేశాయని అన్నారు. పర్యాటకంపై ప్రచారం పేరుతో ఈ అశ్లీల ప్రదర్శన ఏమిటని ఫారూక్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనికి బాధ్యులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఫ్యాషన్ షోపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో సీఎంవో ఎక్స్‌లో స్పందించింది. 'వారి ఆగ్రహం, దిగ్భ్రాంతి పూర్తిగా అర్థం చేసుకోదగ్గది. దానికి సంబంధించి మేం చూసిన చిత్రాలు స్థానికుల మనోభావాలను దెబ్బ తీసేవి. పైగా రంజాన్ మాసంలో ఇది ఎంత మాత్రం తగనిది. మా కార్యాలయం అధికారులు స్థానిక అధికారులను వివరణ అడిగారు. నివేదిక రాగానే బాధ్యులపై తగిన చర్య తీసుకుంటాం' అని సీఎంవో పేర్కొంది.



రోదసిలో తొలిసారి వాణిజ్య నిఘా

దక్షిణ అమెరికాను చిత్రీకరించిన భారత శాటిలైట్

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే మొట్టమొదటి వాణిజ్య అంతరిక్ష నిఘా ఉపగ్రహం కార్యకలాపాలు శనివారం ప్రారంభమయ్యాయి. దీనిని స్పేస్ కెమెరా ఫర్ ఆబ్జెక్ట్ ట్రాకింగ్ (ఎస్‌సీఓటీ) అంటారు. ఈ నిఘా ఉపగ్రహం భూ కక్ష్యలో తిరుగుతూ భూమిపై గల 5 సెంటీమీటర్ల వస్తువును సైతం చిత్రీకరించగలదు. దీనిని భారత స్టార్టప్ 'దిగంతర' జనవరి 14న ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ ట్రాన్స్‌పోర్టర్-12 రాకెట్ ద్వారా ప్రయోగించింది. ఈ ఉపగ్రహం తన పనిలో భాగంగా మొదట దక్షిణ అమెరికాలోని బ్యూనస్ ఎయిర్స్ నగరాన్ని చిత్రీకరించింది. తమ శాటిలైట్ పంపిన మొదటి చిత్రం కేవలం సాంకేతికపరమైన మైలురాయి మాత్రమే కాదని, అంతకన్నా ఎక్కువని దిగంతర సీఈవో అనిరుద్ధ్ శర్మ తెలిపారు.

గంగా జలాలు స్నానానికి అనువైనవే

కుంభమేళాపై సీపీసీబీ తాజా నివేదిక

న్యూఢిల్లీ, మార్చి 9: ప్రయాగ్‌రాజ్‌లో ఇటీవల ముగిసిన మహా కుంభమేళా సందర్భంగా గంగా నదిలో నీటి నాణ్యత స్నానాలు చేసేందుకు అనువుగా ఉందని గ్రీన్ టిబ్యునల్‌కు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీపీసీబీ) తన తాజా నివేదికలో తెలియచేసింది. వేర్వేరు రోజులలో ఒకే ప్రదేశం నుంచి సేకరించిన నీటి నమూనాలు, ఒకే రోజున వేర్వేరు ప్రదేశాలలో తీసుకున్న నీటి నమూనాలలో భిన్న వివరాలు ఉన్న కారణంగా నది ప్రవాహ వ్యాప్తంగా నీటి నాణ్యత మొత్తంగా అందులో ప్రతిబింబించ లేదని, ఈ కారణంగా గణాంక విశ్లేషణ నిర్వహించాల్సిన అవసరం ఏర్పడిందని సీపీసీబీ తన నివేదికలో తెలిపింది. పవిత్ర స్నానాలకు ముఖ్యమైన రోజులతో సహా జనవరి 12 నుంచి వారానికి రెండుసార్లు చొప్పున గంగా నది ప్రవహించే ఐదు ప్రదేశాలలో, యమునా నది ప్రవహించే రెండు ప్రదేశాలలో నీటి నాణ్యతను పర్యవేక్షించినట్టు జనవరి 28వ తేదీ నాటి తన నివేదికలో సీపీసీబీ వెల్లడించింది.

కాలుష్య గంగలో స్నానం చేయను

గంగా నది శుభ్రత, ఆ నదీ జలాల నాణ్యతపై మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన(ఎంఎన్ఎస్) అధినేత రాజ్ ఠాక్రే అనుమానాలు వ్యక్తం చేశారు. గంగా నదిలో తాను పవిత్ర స్నానం చేయబోనని ఆయన ప్రకటించారు. మూఢనమ్మకాలు వీడి వివేకంతో ఆలోచించాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఎంఎన్ఎస్ 19వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శనివారం ఓ కార్యక్రమంలో రాజ్ ఠాక్రే మాట్లాడుతూ తన పార్టీ నాయకుడు బాల నంద్‌గావ్‌కర్ ఇటీవల ప్రయాగ్‌రాజ్‌లో ముగిసిన మహా కుంభ్ నుంచి పవిత్ర గంగా జలాలను తీసుకువచ్చారని, వాటిని తాగేందుకు నిరాకరించానని చెప్పారు.

ఆస్ట్రేలియాలో బీజేపీ నేతకు 40 ఏండ్ల శిక్ష

ఉద్యోగాలిప్పిస్తానని ఐదుగురిపై అత్యాచారం

సిడ్నీ : భారత సంతతి బీజేపీ నేత బాలేశ్ ధన్‌కర్‌కు ఆస్ట్రేలియా కోర్టు 40 ఏండ్ల జైలు శిక్ష విధించింది. కొరియన్-ఇంగ్లిష్ అనువాదకుల ఉద్యోగాలు ఉన్నాయని మోసపూరితంగా ప్రకటనలు ఇచ్చి, ఐదుగురు కొరియన్ మహిళలపై ఆయన అత్యాచారం చేసినట్లు రుజువు కావడంతో శుక్రవారం కోర్టు ఈ తీర్పు వెలువరించింది. ధన్‌కర్ బాధిత మహిళలకు మత్తు మందులు ఇచ్చి వారిపై లైంగిక దాడి చేశాడని... ఆ దృశ్యాలను చిత్రీకరించాడని కోర్టు 2023 ఏప్రిల్‌లో తీర్పు చెప్పింది. ఆయనకు 30 ఏండ్ల పాటు పెరోల్ మంజూరు చేయరాదని జడ్జి ఆదేశించ